క్లుప్తంగా

పాఠశాలకు ఫ్యాన్‌ల వితరణ



ఉపాధ్యాయులకు ఫ్యాన్‌లు అందిస్తున్న పూర్వ విద్యార్థి చిన్నంనాయుడు

సంతకవిటి: బొద్దూరు ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కొరికాన చిన్నంనాయు డు 'మన ఊరు– మన బడి' కార్యక్రమంలో భాగంగా రెండు ఫ్యాన్‌లు వితరణ చేశారు. శనివారం వాటిని హెచ్‌ఎం మల్లేశ్వర రావు, ఉపాధ్యాయులు ఏ.దామోదరరావు, కృష్ణ, ప్రసాద్‌కు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారులు లక్ష్మి, దిలీప్‌కుమార్

రామభద్రపురం: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.లక్ష్మి, దిలీప్‌కుమార్ సూచించారు.స్థానిక పీహెచ్‌సీలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరికైనా జ్వర లక్షణాలు కనిపిస్తే దగ్గరలో ఉన్న వైద్యాధికారిని సంప్రదించి వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు

జాబ్ మేళాలో 112 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పలనాయుడు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరాగాంధీ డిగ్రీ కాలేజ్‌లో ఏపీ, తెలంగాణకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు శనివారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. బొబ్బిలితో పాటు పలు ప్రాంతాలకు చెందిన 198 మంది నిరుద్యోగ యువత, విద్యార్థులు హాజరు కాగా వారి అర్హతను అనుసరించి ఆయా కంపెనీల ప్రతినిధులు 112 మందిని ఎంపిక చేశారు. వీరికి ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు, ఆయా కంపెనీల ప్రతినిధుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన వారికి వారి అర్హతలను బట్టి రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఇచ్చేందుకు ఆయా కంపెనీలు అంగీకరించాయని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన



ఏఓ సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వంగర: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలో పని చేస్తున్న పంచాయతీ కార్యద ర్శులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. పనిభారం తగ్గించాలని, పదోన్నతులు కల్పించాలని, పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఏఓ సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

మిగులు ప్లాట్లను గుర్తించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుధాకర్

బాడంగి: మండలంలోని పలుగ్రామాల్లో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరిట ఏర్పాటు చేసిన లేఅవుట్ల లో మిగులు ప్లాట్లను గుర్తిండంతో పాటు, ఇంకా ఇళ్ల నిర్మాణా లు చేపట్టని వారి వివరాలతో నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ కె.సుధాకర్ వీఆర్‌ఓలను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతప్రభుత్వ హయాంలో మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో, మరికొన్ని గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన భూముల్లో లేఅవుట్లు వేసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. కొంతమంది ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆపేయగా, మరికొందరు ప్రారంభించనే లేద ని, అలాంటి వాటిని గుర్తించాలని చెప్పారు. హెచ్‌డీటీ ధనం,ఎంఆర్‌ఐ జగదాంబ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'వసతి' కష్టాలు

- వసతి గృహాల్లో తిష్టేసిన సమస్యలు
- కానరాని రక్షణ, పర్యవేక్షణ
- అద్దె భవనాల్లో అరకొర వసతులు

రాజాం: పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉండే సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రాజాం నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాల, పాఠశాలల బాలురు,బాలికల వసతిగృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సకాలంలో బిల్లులు అందక, కాస్మో టిక్స్ చార్జీలు రాక, దుప్పట్లు, కార్పెట్ల పంపిణీ లేక విద్యార్థులకు అవస్థలు, నిర్వాహకులకు తల నొప్పులు తప్పడం లేదు. రాజాం పట్టణంలో అయిదు సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో మూడు బాలికలకు సంబంధించినవి, రెండు బాలురవి. బాలికలకు సంబంధించి బీసీ జనరల్ బాలికల కళాశాల వసతిగృహం అద్దె భవ నంలో నడుస్తోంది. ఈభవనం వ్యాపార సంస్థల మధ్య ఉండడంతో ఆకతాయి ల వల్ల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి వసతి గృహానికి రక్షణలేదు. విద్యార్థినులపై పర్యవేక్షణ లేకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈవసతి గృహం వద్ద సీసీ కెమెరాలు కూడా లేవు. శ్రీకాకుళం రోడ్డులోని సాంఘిక సంక్షేమ పోస్టుమెట్రిక్ బాలుర వసతిగృహంలో పర్యవేక్షణ కరువైంది. గతంలో ఈ వసతిగృహానికి చెందిన విద్యార్థు లు రాత్రి వేళల్లో బయటకు వచ్చి ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. అలాగే ఇక్కడ తరచూ తాగునీరు, వాడుక నీరు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకొండ రోడ్డులోని పోస్టుమెట్రిక్ బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో ఉంది. ఇక్కడ మరుగుదొడ్లు, స్నానపు గదుల సమస్య ఉంది. గురవాంలో కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) గ్రామ శివారులో శ్మశాన వాటికను ఆనుకుని ఉంది. విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వీరికి కాస్మోటిక్స్ కూడా గతంలో మాదిరిగా సకాలంలో అందడం లేదు.



రాజాంలో వ్యాపార సంస్థల మధ్యలో కళాశాల బాలికల వసతిగృహం

శిథిలావస్థలో...

రేగిడి మండలం ఏ.వి.పురంలో బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థలో ఉంది. ఇక్కడ ఎటువంటి మౌలికవసతులు లేవు. విద్యార్థులు రాత్రి సమయాల్లో ఇక్కడ ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో దేవుదళ కేజీబీవీ పాఠశాలలో సరైన వసతిసదుపాయాలు లేవు. ఇక్కడ విద్యార్థులకు సరిపడే మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవు.

– సంతకవిటి మండలంలో రెండు బీసీ బాలుర వసతిగృహాలతో పాటు ఒక ఎస్సీ బాలుర వసతిగృహం ఉంది. రెండు బీసీ బాలుర హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. సంతకవిటిలోని బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్లు, డార్మెటరీల సమస్య ఉంది. స్నానపు గదుల కొరత ఉండడంతో ఇక్కడ విద్యార్థుల ఆరుబయట స్నానాలకు వెళుతున్నారు. గుళ్లసీతారాంపురంలో ఎస్సీ బాలుర వసతిగృహం అధ్వాన్నస్థితిలో అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. ఇక్కడ నిర్వహణలోపం స్పష్టంగా కనిపిస్తోంది. సిరిపురంలోనూ ఇదే పరిస్థితి. వాసుదేవపట్నం కేజీబీవీలో విద్యార్థినులకు సరిపడా స్నానపుగదులు లేవు. తాగునీటి సమస్య వెంటాడుతోంది.



రేగిడి మండలం ఏ.వి.పురంలో శిథిలావస్థలో ప్రమాదకరంగా వసతిగృహ భవనం



అద్దెభవనంలో సంతకవిటి బీసీ బాలుర వసతిగృహం

- వంగర మండలంలో ఒక వసతిగృహంతో పాటు ఒక రెసిడెన్సియల్ స్కూల్, ఒక కేజీబీవీ ఉన్నాయి. వీటిలో డైనింగ్ హాళ్లు లేకపోవడంతో విద్యార్థులు అక్కడే భోజనాలు, చదువు, నిద్రించడం చేస్తున్నారు. ఎం.సీతారా పురం బీసీ బాలురవసతి గృహంలో తాగునీటి పైపులైన్ పాడవడంతో సక్రమంగా తాగునీరు అందడం లేదు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

రాజాం సిటీ: ఎన్నికల హామీల అమలులో రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు.రాజాంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సీపీఐ మహాసభలో ఆయన మాట్లాడుతూ పేదలు, కార్మికుల సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో కొత్త పరిశ్రమలు రాకపోగా రెండు పరిశ్రమలు మూతపడ్డాయని అన్నారు. నిరుద్యోగాన్ని రూపుమాపాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. అలాగే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశప్రజల సంరక్షణ, సంక్షేమాన్ని విస్మరించిందని, నిరుద్యోగాన్ని, పేదరికాన్ని తారాస్థాయికి చేర్చిందని విమర్శించారు. జిల్లాలో సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాటాలకు సంబంధించిన కార్యాచరణపై చర్చించేందుకు జూలై 26, 27వ తేదీల్లో బొబ్బిలిలో సీపీఐ 14వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా మహాసభలను సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి అలమండ ఆనందరావు, కార్యవర్గ సభ్యులు ఎస్.నాగభూషణరావు, కృష్ణ, గంగారాం, అప్పారావు, నీలకంఠేశ్వర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గోతులమయమైన గ్రోత్‌సెంటర్ రోడ్లు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఉత్తరాంధ్రలోని అతి పెద్ద చిన్న తరహా పరిశ్రమల కేంద్రమైన బొబ్బిలి గ్రోత్ సెంటర్‌కు వెళ్లే ప్రధాన రహదారుల్లో ఒకటి. ఈ రహదారి గుండా వెళితే ఇసుక స్టాక్‌పాయింట్‌తో పాటు కొన్ని చిన్న తరహా పరిశ్రమలను చేరుకోగలం. కానీ వాటికి వెళ్లాలంటే మాత్రం ఈ చెరువు లాంటి గుంతను దాటాల్సిందే..! ఇటువంటి గుంతలు గ్రోత్ సెంటర్ నిండా కోకొల్లలు. ఇటీవల రూ.2 కోట్లతో గ్రోత్ సెంటర్ రోడ్ల మరమ్మతులు ప్రారంభించినట్టు అధికారులు చెప్పారే కానీ పనులు జరిగినట్టు కానరావడం లేదు.
– బొబ్బిలి

నిరుపయోగంగా..



తెర్లాం మండలంలోని ఎన్.బూర్జవలస గ్రామంలో సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి.స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటిని నిర్మించారు. నిర్మాణాలకు బిల్లులు అందిన వెంటనే వాటిని అలా వదిలేశారు. రన్నింగ్ వాటర్ సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు వీటిని వినియోగించడం లేదు.
– తెర్లాం

వీధి మధ్యలో ఇలా.. నడిచేది ఎలా..?



రామభద్రపురం మండలంలోని కొండపాలవలస గ్రామంలో వీధి రోడ్డు అధ్వానంగా తయారైంది. వీధి మధ్యలో సీసీ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు, మురుగు నీరు రోడ్డుపై నుంచే పారుతోంది.రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడడం, వర్షం నీరు, మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవ డంతో బురదమయమై దమ్ముమడిని తలపిస్తోంది. గ్రామస్తులు ఈమార్గంలో నడిచి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నా రు.అధికారులు స్పందించి సీసీ కాలువలు నిర్మించడంతో పాటు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.
– రామభద్రపురం

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, సురేష్

రేగిడి: గ్రామ పంచాయతీలకు15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు మండిపడ్డారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంటనే పంచాయ తీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని కోరారు. నిధులు విడుదల చేయకుండా పారిశుద్ధ్య పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులపై అధికారులు ఒత్తిడి తీసుకురావడం తగదన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.21.09 కోట్లు విడుదల చేసిందని, వాటిని ఇంత వరకు ప్రభుత్వం స్థానిక సంస్థలకు జమచేయలేదన్నారు. నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో వీధి దీపాలు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ చేపట్టలేని దుస్థితి సర్పంచ్‌లకు దాపురించిందన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలను గ్రామ పంచాయతీల నుంచి చెల్లించమనడం సమంజసం కాదని, ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యద ర్శులు చేస్తున్న పోరాటానికి వైఎస్సార్‌సీపీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని చెప్పారు. ఎంపీటీసీ కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వితే కఠిన చర్యలు

- పెరుమాళిలో మట్టి తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీ, ట్రాక్టర్ సీజ్

సాక్షి ఎఫెక్ట్...

తెర్లాం: అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని పెరుమాళి గ్రామంలోని చాకిరేవు చెరువులో ఇష్టారీతిగా చేపడుతున్న మట్టి తవ్వకాలపై శనివారం సాక్షి దిన పత్రికలో 'అక్రమ మట్టి తవ్వకాలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ హేమంత్‌కుమార్ స్పందించారు. చెరువులో మట్టి తవ్వకాలు చేసిన జేసీబీ, ట్రాక్టర్‌ను సిబ్బందితో సీజ్ చేయించి, స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. అనుమతి లేకుండా చెరువులో 34 మెట్రిక్ టన్నుల మట్టి తవ్వకాలు చేసినట్టు నిర్ధారించి, తవ్వకాలకు పాల్పడిన వ్యక్తికి రూ.2,637 అపరాధ రుసుం విధించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి, కంకర తవ్వకాలు చేయడం నేరమన్నారు. పెరుమాళి చాకిరేవు చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న విషయం తెలిసిన వెంటనే ఆర్‌ఐ కృష్ణమూర్తి, వీఆర్‌ఓ సుధాకర్‌ను పంపించి జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేయించామని చెప్పారు. అలాగే చెరువులో ఎంతమట్టి తీశారో పరిశీలించి సంబంధిత వ్యక్తికి అపరాధ రుసుం విధించామని తెలిపారు.



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- జేఎన్‌టీయూ జీవీ వీసీ డాక్టర్ రాజ్యలక్ష్మి



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న వీసీ రాజ్యలక్ష్మి, తదితరులు

రాజాం సిటీ: విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నైపుణ్యాలను మెరుగుపరు చుకోవాలని జేఎన్‌టీయూ జీవీ(గురజాడ విజయనగరం) వైస్ చాన్సలర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో శనివారం నిర్వహించిన 10వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతికత రోజు రోజుకీ కొత్త పుంతలు తొక్కుతోందని, వాటికి అనుగుణంగా విద్యార్థులు స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీలో మైనర్ డిగ్రీ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఇందులో నైపుణ్యం ఉన్నవారికి రానున్న రోజుల్లో మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మనం చేసే పనిలో నిబద్ధత ఉండాలని, లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలని, అందరితో మర్యాదగా మసలుకోవాలని హితవు పలికారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి.ప్రసాద్ మాట్లా డుతూ విద్యార్థులు తమకు ఎదురయ్యే సవాళ్లను స్వీకరించి, లక్ష్యసాధనలో ముందుకు సాగాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ జె.గిరీష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రాథమిక పరిజ్ఞానం ఉపయోగించి నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని అన్నారు. అనంతరం ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలాస్టిక్ అవార్డులు అందజేశారు. జీఎంఆర్ వీఎఫ్ సీఈఓ అశ్వినీసక్సేనా, ఎల్ఎం లక్ష్మణమూర్తి, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తమ్మయ్యవలసలో పారిశుద్ధ్య పనులు



వీధి కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో సర్పంచ్ శనపతి రాంబాబు ఆధ్వర్యంలో రెండు రోజులుగా పారిశుద్ధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్నారు. వీధికాలువల్లో చెత్తపారబోయవద్దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సర్పంచ్ సూచించారు.

సంక్షిప్తంగా...

మత్తు పదార్థాల జోలికి పోవద్దు



అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్ర

రేగిడి: భవిష్యత్‌ను, ఆరోగ్యాన్ని నాశనం చేసే మత్తుపదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర సూచించారు.పెద్దశిర్లాం గ్రామస్తులకు శనివారం ఆయన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పిల్లల ప్రవర్తన, నడవ డికపై పెద్దలు దృష్టిసారించాలని అన్నా రు. పిల్లలు చెడు మార్గంలో పయనిం చకుండా చూసుకోవాలని చెప్పారు. చట్టాల పై అవగాహన పెంచుకోవాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామపెద్దలు లెంక రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



బూరాడ కాలనీ ప్రాథమి పాఠశాలలో చేరిన విద్యార్థినితో ఎంఈఓలు

రేగిడి: తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని సదుపాయాలతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించా లని ఎంఈఓలు ఎం.వి. ప్రసాదరావు, బి.ఎరకయ్య కోరారు.బూరాడ గ్రామంలోని ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారు ఉపాధ్యాయులకు పలుసూచనలు చేశారు. బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో జాయిన్ అయిన గ్రామంలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో ఒక బాలికను చేర్పించారు.

పీఏసీఎస్‌లకు చైర్‌పర్సన్‌ల నియామకం

రామభద్రపురం: మండలంలోని పీఏసీఎస్‌లకు (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు) ప్రభుత్వం నూతన చైర్మన్లను నియమించింది. రామభద్రపురం పీఏసీఎస్‌కు చొక్కాపు విజయలక్ష్మి, ఆరికతోట పీఏసీఎస్‌కు జాగాన ప్రసాదరావు, కొట్టక్కి పీఏసీఎస్‌కు ముల్లు రాంబాబు, కొత్తరేగ పీఏసీఎస్‌కు రెడ్డి పారంనాయుడును నియమితులయ్యారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



రాజాం : కంచారంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం/బొబ్బిలిరూరల్/వంగర/రేగిడి: పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి అందరి బాధ్యత అని రాజాం, బొబ్బిలి,వంగర,రేగిడి మండలాల ఎంపీడీఓలు వి.శ్రీనివాసరావు, పి.రవికుమార్, ఎస్.రఘునాథాచారి, శ్యామలాకుమారి అన్నారు.రాజాం మండలంలోని కంచరాం, అంతకాపల్లి, పొగిరి, గురవాం తదితర గ్రామాల్లో, బొబ్బిలి మండలంలోని ఎం.బూర్జివలస, వంగర మండలం లోని తలగాం, రేగిడి మండలంలోని లచ్చారాయపురం, గుళ్లపాడు, రేగిడి తదితర గ్రామాల్లో ఆయా మండలాల ఎంపీడీఓలు శనివారం పర్యటించారు.ఆయా గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణను పరిశీలించి క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. చెత్తను ఆరుబయట పారబోయకుండా ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజే యాలని గ్రామస్తులను కోరారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న శ్రీకావ్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మన్మథరావు, సిబ్బంది

రేగిడి: కందిశ గ్రామంలోని శ్రీకావ్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన ప్రస్తుత,పూర్వ విద్యార్థులను ఆ పాఠశాల కరస్పాండెంట్ కెల్ల మన్మథరావు, ప్రిన్సిపాల్ పొన్నాడ సన్యాసినాయుడు, స్కూల్ సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకున్న మీసాల పవన్‌కుమార్‌నాయుడు, జేఈఈ అడ్వాన్స్‌లో ఆలిండియాలో 750వ ర్యాంకు సాధించి కాన్పూర్‌లో ఐఐటీ సీటుదక్కించుకున్నాడు. అలాగే నీట్‌లో కొల్లేటి గాయత్రిపల్లుని, ఉత్తరావెల్లి ప్రణతి మంచి ర్యాంకులు సాధించారు. జవహర్ నవోదయ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో విద్యార్థులు నెల్లి రోహిత్‌కుమార్, పాలవలస సత్యంనాయుడు ఉత్తమ ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. అలాగే ఈ ఏడాది పదో తరగతిలో పాఠశాల విద్యార్థిని వంజరాపు కావ్యశ్రీ మండలం ఫస్ట్ వచ్చింది. వీరందరినీ పాఠశాల సిబ్బంది సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

చెవిలో పువ్వులతో నిరసన

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుండా చర్చల పేరిట కాలయాపన చేస్తూ చెవుల్లో పువ్వులు పెడుతోందని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు విమర్శిస్తున్నారు. కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని స్థానిక అన్నా క్యాంటిన్ ఆవరణలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్. రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ గత 53 రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పి రెండు దఫాలు మంత్రులు, అధికారులు చర్చలు జరిపారని, కానీ ఏ సమస్యా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కల్పించుకుని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్, మరియదాసు, కృష్ణ, గణపతి, శ్రీనివాసరావు, ప్రసన్న, శారద, లక్ష్మి, మోహన్, రామకృష్ణ, సోమేష్, ఆశాలత, సత్యనారాయణ పాల్గొన్నారు.



చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు